సాక్షి
వికారాబాద్

శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



విద్యార్థులకు అల్పాహారం

పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. 10లో▸



అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. 10లో▸



నిధులు మంజూరయ్యేనా?

జాతీయ స్థాయి ప్రమాణాలు పాటించే ఆస్పత్రుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు కావడంలేదు. 11లో▸

న్యూస్‌రీల్

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



రుద్రారం గ్రామ శివారులో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్: మండలంలోని రుద్రారం గ్రామ శివారులో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అధికారులు శుక్రవారం భూమిని పరిశీలించారు. రుద్రారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 151లోని స్థలాన్ని తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ ఇతర అధికారులు పరిశీలించారు. సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అధికారులు తెలిపారు. వ్యవసాయానికి కావాల్సిన విద్యుత్‌ను సోలార్ ద్వారా ఆయా గ్రామాల్లోనే ఉత్పత్తి చేసుకునే విధంగా ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో, రెవెన్యూ, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కుల్కచర్లకు కేటీఆర్ రాక

కుల్కచర్ల: మండలంలో శనివారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించనున్నారు. దాస్యనాయక్ తండాలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి అజయ్ నాయక్ కోరారు.

కేంద్ర మంత్రిని కలిసిన మారుతీకిరణ్



పరిగి: కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషిని బీజేపీ పరిగి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారుతీకిరణ్ శుక్రవారం కలిశారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌తో కలిసి కేంద్ర మంత్రి కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో సోలార్ పార్క్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. అందుకు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

ఘన సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన ఎస్‌ఐలను సన్మానించిన ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: విధి నిర్వహణలో మనం చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో చాలా కాలంగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఎస్‌ఐలు మీర్ ఫయాజ్ అలీ, జీవరత్నంను శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇద్దరు అధికారులు చిన్న స్థాయి నుంచి నేడు ఎస్‌ఐ స్థాయి వరకు ఎదగడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఏఓ జ్యోతిర్మణి, ఏఆర్ డీఎస్పీ వీరేష్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజు, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కుల్కచర్ల మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు

కుల్కచర్ల: స్థానిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఎంపీటీసీ స్థానాల ముసాయిదాను ప్రకటించారు. కుల్కచర్ల మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు కుల్కచర్ల, కామునిపల్లి, పటేల్ చెరువు, కుస్మసముద్రం, అంతారం, బండవెల్కిచర్ల, ఘణపూర్, ముజాహిద్‌పూర్, పుట్టపహాడ్, సాల్వీడు గ్రామాలను ఎంపీటీసీ కేంద్రాలు ప్రకటించారు. చౌడాపూర్ మండలంలో వాల్యానాయక్ తండా, చౌడాపూర్, ఈర్లవాగు తండా, మక్తవెంకటాపూర్, మల్కాపూర్, కల్మన్‌కాల్వ, కొత్తపల్లి, మరికల్ గ్రామాలను ఎంపీటీసీ స్థానాలుగా ప్రకటించారు.

భరోసా 3 శాతమే..



ఇటీవల ధారూరు మండలంలో మహిళకు పథకం మంజూరు పత్రం అందజేస్తున్న అధికారులు

ప్రతి మండలం నుంచి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి సాగు సాయం అమలు

- 5,90,009 ఎకరాలకు పథకం అమలు చేయాలని నిర్ణయం
- రైతుల ఖాతాల్లో జమ చేయాల్సిన నగదు రూ.354 కోట్లు
- ఇప్పటి వరకు వేసింది రూ.11.18 కోట్లే..
- ఇందిరమ్మ ఇళ్లకు 1,48,663 మంది అర్హులు
- మొదటి విడతలో 14వేల ఇళ్లు మంజూరు

వికారాబాద్: ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన పథకాలు ప్రతి మండలంలో ఒక్కో గ్రామానికే పరిమితమయ్యాయి. అది కూడా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించిన డబ్బులు మాత్రమే రైతులు, కూలీల ఖాతాల్లో జమ చేశారు. ఈ రెండు పథకాలకు విడుదల చేయాల్సిన మొత్తంలో ఇచ్చింది కేవలం మూడు శాతం మాత్రమే. నాలుగు సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసిన ప్రభుత్వం ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమలు చేసిన విషయం తెలిసిందే. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా పథకాలను ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ ప్రతి మండలంలో ఒకే గ్రామానికి అమలు చేయడంతో మిగతా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తమ గ్రామాలకు ఎప్పుడు అమలు చేస్తారా అని ఎదురు చూస్తున్నారు.

లబ్ధిదారుల ఎంపికతో సరి

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పరిస్థితి ఇలా ఉండగా ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ కాగితాలకే పరిమితమైంది. జిల్లాలో 2.57లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1,48,663 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో 54,806 మంది ఇల్లు, ఇంటి స్థలం లేని వారు ఉన్నట్లు గుర్తించారు. మరో 93,857 మందికి స్థలం ఉండి ఇళ్లు లేవని నిర్ధారించారు. మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున అంటే జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు 14వేల ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉంది. గ్రామాల వారీగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు పేపర్‌పై మీకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైందని రాసి ఇచ్చారు. రేషన్ కార్డుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇప్పటి వరకు రేషన్ కార్డులకు గానీ, ఇందిరమ్మ ఇళ్లకు గానీ ఎలాంటి ప్రొసిడింగులు ఇవ్వక పోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పథకాల గురించి తెలుసుకునేందుకు ప్రజలు క్షేత్రస్థాయి అధికారుల వద్దకు క్యూ కడుతున్నారు.

8,609 మందికే రైతు భరోసా

జిల్లాలోని 2,68,107 మంది రైతులకు చెందిన 5,90,009 ఎకరాల భూమికి రైతుల భరోసా పథకంఅమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 27వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని ప్రకటించింది. అయితే ప్రతి మండలం నుంచి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేశారు. అంటే జిల్లాలో 20 మండలాలు ఉండగా 20 గ్రామాల రైతులకే పథకాన్ని అమలు చేశారు. ఈ గ్రామాల్లోని 8,609 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.11.18 కోట్లు వేశారు. మిగతా రైతుల ఖాతాల్లో మరుసటి రోజు నుంచి డబ్బు జమ చేస్తామని చెప్పారు. కానీ వారం రోజులు అవుతున్నా మిగతా గ్రామాలకు పథకం అమలు కాలేదు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం పరిస్థితి కూడా ఇలానే ఉంది. జిల్లాలో 22 వేల మంది కూలీలను ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేశారు. ఎంపిక చేసిన 20 గ్రామాల్లోని 660 మంది కూలీల బ్యాంక్ ఖాతాల్లో రూ.39.60 లక్షలు జమ చేశారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నీటి సమస్య పరిష్కారంపై సంబంధిత అధికారులతో సమీక్షనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. జిల్లాలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోతున్న నేపథ్యంలో వాటిని పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. మిషన్ భగీరథ నుంచి తాగునీటి సరఫరాను నిరంతరం కొనసాగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అదనపు ట్యాంకర్లను సిద్ధంగా ఉంచి, నీటి అవసరాన్ని తీర్చాలన్నారు. ప్రతి మండలంలో నీటి నిల్వలను అంచనా వేసి నివేదిక ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో నీటి సరఫరా కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మండలాల వారీగా ఎన్ని పైప్ లైన్లు ఉన్నాయి.. ఏవేవి పని చేస్తున్నాయి.. ఏమైనా సమస్యలున్నయా అని అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పైప్‌లైన్లు, బోర్లను పరిశీలించి లీకేజీలు ఉంటే వెంటనే బాగు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో నీటి వనరుల స్థితిగతులను పర్యవేక్షించేందుకు స్థానిక అధికారులను నియమించాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, డీఎంహెచ్‌ఓ వెంకటరవణ, మిషన్ భగీరథ అధికారి చల్మారెడ్డి, ఎంపీడీవోలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు, రురల్ వాటర్ సప్లై విభాగం అధికారులు, డీఈలు, ఈఈలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగిలో దొంగనోట్ల కలకలం!

- సీఎస్‌సీ సెంటర్‌లో ఇచ్చారన్న బాధిత మహిళ
- పోలీసులకు ఫిర్యాదు



నకిలీ నోట్లను చూపుతున్న సుగుణమ్మ

పరిగి: పరిగి పట్టణంలో దొంగనోట్ల కలకలం రేపుతోంది. పట్టణానికి చెందిన సుగుణమ్మ ఖాతాలో క్రాప్‌లోన్ డబ్బు జమ కావడంతో ఈ నెల 24న స్థానిక సీఎస్‌సీ సెంటర్‌లో రూ.30 వేలు డ్రా చేసుకుంది. ఈ డబ్బును ఇంట్లో భద్రపరిచింది. శుక్రవారం ఉదయం అప్పుతీసుకున్న వ్యక్తి రావడంతో అందులో కొంత డబ్బు ఇచ్చింది. అక్కడే ఆ నోట్లను పరిశీలించగా అవి నకిలీవని తేలింది. దీంతో మహిళ తన వద్ద ఉన్న మిగతా నోట్లును కూడా చూసింది. అవికూడా దొంగ నోట్లని తేలడంతో అవాక్కయ్యింది. వెంటనే బాధిత మహిళా సీఎస్‌సీ సెంటర్‌కు వెళ్లి నిర్వాహకుడిని నిలదీసింది. తాను మంచి నోట్లు ఇచ్చానని మీరే మార్చి తన వద్దకు తెచ్చారని చెప్పాడు. మీరే రూ.30 వేలు కవర్‌లో పెట్టి ఇచ్చారని మహిళ పదేపదే చెప్పడంతో సెంటర్ నిర్వాహకుడు సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించాడు. అందులో మిషన్‌లో నోట్లు లెక్కించి మహిళ చేతికి ఇచ్చినట్లు రికార్డయ్యింది. మహిళ తెచ్చిన నోట్లను మిషన్‌లో పెట్టగా అవి బయటకు రాలేదు. కౌంటింగ్ మిషన్‌లో దొంగనోట్లు పెడితే హారన్ వస్తుందని, నేను ఇచ్చిన సమయంలో హారన్ రాలేదని సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకుడు తెలిపాడు. సుగుణమ్మ ఇంట్లో కానీ, మరెక్కడైనా డబ్బులు మార్పిడి జరిగి ఉండవచ్చని నిర్వాహకుడు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకుడిని స్టేషన్‌కు పిలిచి విచారించారు. వివరాలు తెలియాల్సి ఉంది.

పోలీసుల అదుపులో కి‘లేడీ’

- మహిళల మెడల్లో బంగారు గొలుసులు కాజేస్తున్న అమూల్య
- రద్దీ ప్రాంతాలు, బస్టాండ్‌లే టార్గెట్
- పరిగి బస్టాండ్‌లో చోరీ కేసులను ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాస్

పరిగి: రద్దీ ప్రాంతాలు, బస్టాండ్‌లే టార్గెట్‌గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న కిలాడీ లేడీని పరిగి పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన వివరాలను పరిగి సీఐ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాస్ వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లా సీతానగర్, భువనగిరి పట్టణానికి చెందిన పసుపులేటి అమూల్య రద్దీ ఉండే బస్టాండ్‌లలో మహిళల మెడల్లోని బంగారు గొలుసులు దొంగలిస్తోంది. పరిగి బస్టాండ్‌లో నెల రోజుల వ్యవధిలో మూడు దొంగతనాలు జరిగాయి. దీంతో పోలీసులు నిఘా పెంచారు. చోరీలకు పాల్పడుతోంది పసుపులేటి అమూల్య అని గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకొని విచారించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాజస్థాన్‌కు చెందిన మహ్మద్ ఇక్బాల్ హైదరాబాద్‌లో ఉంటూ జార్ఖండ్, బీహార్, ఒరిస్సా గ్యాంగ్‌ల సహకారంతో తమతో దొంగతనాలు చేయిస్తున్నట్లు ఒప్పుకుంది. దొంగతనం చేసిన మొత్తంలో సగం మహ్మద్ ఇక్బాల్‌కు ఇస్తున్నట్లు తెలిపింది. డబ్బు ఇవ్వకుంటే పోలీసులకు పట్టిస్తామని వారు బెదిరిస్తున్నారని చెప్పింది. తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక ప్రాంతాల్లో దొంగతనాలు చేయిస్తాడని పేర్కొంది. ప్రస్తుతం మహ్మద్ ఇక్బాల్ పరారీలో ఉన్నాడు. జిల్లాలో పసుపులేటి అమూల్య ఐదు దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. వికారాబాద్ బస్టాండ్‌లో రెండు, పరిగి బస్టాండ్‌లో మూడు దొంగతనాలు చేసినట్లు వివరించారు. 11 తులాల 8 గ్రాముల బంగారు నగలు, రూ.1,60,000 నగదు చోరీ చేసినట్లు తెలిపారు. అమూల్య నుంచి 11.8 తులాల బంగారు నగలు, రూ.80 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో సీసీఎస్ సీఐలు బలవంతయ్య, అన్వర్, పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై సంతోష్‌కుమార్, పోలీసులు జయవర్ధన్, శివకుమార్, చెన్నయ్య, రామకృష్ణ, గోవింద్, రాఘవేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న డీఎస్పీ శ్రీనివాస్

పాట ఉన్నంతకాలం గద్దర్ ఉంటారు

- స్పీకర్ ప్రసాద్‌కుమార్
- ఘనంగా 77వ జయంతి

అనంతగిరి: గద్దర్ అనేది ఒక పేరు కాదు అది ఒక కెరటం అని, సమాజంలో జరుగుతున్న అన్యాయంపై పాట రూపంలో తిరగబడిన బల్లెం అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారథి, భాషా సాంస్కృతిక శాఖ సారథ్యంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ 77వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్పీకర్. కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గద్దర్‌తో రాజకీయ నాయకులకు సిద్ధాంత పరమైన విభేదాలు ఉండొచ్చే కానీ బడుగు, బలహీన వర్గాలకు న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. దొరతనాన్ని ఎదిరించి గజ్జె కట్టి పాట పాడినా, తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా ఊరూరా తిరుగుతూ ప్రజలను చైతన్యం చేసినా అది సమాజాన్ని మేల్కొలిపే ఉద్యమమే అన్నారు. కళాకారులు గద్దర్‌ను స్మరిస్తూ పాడిన పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రజా ప్రభుత్వం వచ్చాక గద్దర్‌ను కళాకారుడిగా, తెలంగాణ ఆస్తిగా గుర్తించిందని తెలిపారు. సినిమా కళాకారులకు గద్దర్ అవార్డులను ప్రదానం చేయాలని నిర్ణయించిందని గుర్తు చేశారు. గద్దర్ కూతురు వెన్నెలను తెలంగాణ సాంస్కృతిక సారథిగా నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, డీపీఆర్ఓ చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్, కలెక్టర్, ఎస్పీ తదితరులు

అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తుందని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్ మండలంలో శుక్రవారం రూ.8.43 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్, ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైపాల్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో వినయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ప్రత్యేక అధికారులు ప్రసన్నలక్ష్మి, కల్పన, పంచాయతీ కార్యదర్శులు శిల్ప, రుక్మిణి, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం వికారాబాద్‌లో అవగాహన కార్యక్రమం, బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడపడం ముఖ్యం కాదని.. అప్రమత్తంగా, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ నడపడం అవసరమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, రోడ్డు రవాణా శాఖ జిల్లా అధికారి వెంకట్ రెడ్డి, ఆర్టీఏ మెంబర్ జాఫర్, ఆర్డీవో వాసుచంద్ర, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా.. రోడ్లు మారలే



పెద్దమంగళారం- చందానగర్ రోడ్డును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

మొయినాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వం మారినా రోడ్ల పరిస్థితి మారలేదని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి విమర్శించారు. మొయినాబాద్‌లోని పెద్దమంగళారం- చందానగర్ రోడ్డును శుక్రవారం సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రహదారి పూర్తిగా గుంతలమయమైందన్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రోడ్లన్నీ బాగు చేయాలని, లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రాములు, పాండుగౌడ్, కృష్ణయ్య, హరి, జంగయ్య, రమేశ్, అనురాధ పాల్గొన్నారు.

ఏసీబీ నిఘా నీడలో..

- పూడూరు తహసీల్దార్ కార్యాలయం
- ప్రతి పనికీ డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు
- బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి అవినీతి నిరోధక శాఖ
- సెలవులో వెళ్లిన కొంతమంది సిబ్బంది

పూడూరు: పూడూరు తహసీల్దార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. రైతుల భూములను ఇతరుల పేర్లపై మార్చి డబ్బు దండుకొంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయంలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది చేతులు తడిపితేనే తప్ప పనులు జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రైతుల ప్రమేయం లేకుండా వారి భూములను రియల్టర్ల పేరున నమోదు చేస్తున్నారు. ఈ విషయం కలెక్టర్, ఎస్పీ దృష్టికి కూడా వెళ్లింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూడూరు డిప్యూటీ తహసీల్దార్‌ను శుక్రవారం కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.. ఇదిలా ఉండగా రెండు నెలల క్రితం మండలానికి చెందిన ఓ వ్యక్తి తమ కుటుంబానికి చెందిన ఆరు ఎకరాలు భూమిని విరాసత్ చేయాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విషయమై మహిళా ఆర్‌ఐను కలిశాడు. తరచూ కార్యాలయానికి వస్తున్నా పని కాకపోవడంతో సదరు వ్యక్తి ఆర్‌ఐని నిలదీశాడు.. డబ్బు ఇస్తేనే పని జరుగుతుందని.. తాము కూడా పైఅధికారులకు డబ్బు ఇవ్వాల్సి ఉంటుందని.. రూ.5లక్షలు కావాలని కోరింది.. మండలంలోని మన్నెగూడకు చెందిన మరో వ్యక్తి తన తల్లి చనిపోవడంతో ఆమె పేరిట ఉన్న అసైన్డ్ భూమిని తమ పేరున మార్చాలని కోరితే రూ.2 లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. సదరు అధికారి డబ్బు డిమాండ్ చేస్తుండగా తీసిన వీడియోను బాధిత వ్యక్తి ఏసీబీ అధికారులకు ఇచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు రంగంలోకి దిగి పూడూరు తహసీల్దార్ కార్యాలయంపై నిఘా పెట్టినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న కొందరు అధికారులు సెలవుల్లో వెళ్లారు. తహసీలార్ ఫోన్ స్విచ్ఛ్ ఆఫ్ చేసి ఉండటంతో ఏసీబీ అధికారులు వెనుదిరిగి వెళ్లినట్లు తెలిసింది. విషయం ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో సదరు మహిళా అధికారిని కలెక్టరేట్‌కు అటాచ్ చేశారు. రైతు అనుమతి లేకుండా భూములు బదలాయించిన డీటీని సస్పెండ్ చేశారు.



పూడూరు తహసీల్దార్ కార్యాలయం

క్లుప్తంగా

అభివృద్ధే లక్ష్యం

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్

మర్పల్లి: పల్లెసీమల అభివృద్ధే లక్ష్యమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దార్గులపల్లిలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ పనులను రవీందర్ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నిఖిల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జగదీశ్వర్, వర్కింగ్ ప్రసిడెంట్ రఫియొద్దీన్, బూచన్‌పల్లి గ్రామ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తాండూరు రూరల్: క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పొందవచ్చని సీసీఐ ఫ్యాక్టరీ జీఎం శరత్‌చంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని కరన్‌కోట్ గ్రామంలో స్వర్గీయ డాక్టర్ వికాస్ జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ అమిత్‌రంజన్, మాజీ ఎంపీపీ శరణు బసప్ప, ఎంపీటీసీ మాజీ సభ్యులు రాజ్‌కుమార్, వకుమార్, నాయకులు అనిల్, సుధకర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, భరత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పనిసరి



నర్సింలు దంపతులకు సన్మానం చేస్తున్న రమేశ్ తదితరులు

మర్పల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పనిసరని యూనియన్ బ్యాంకు మేనేజర్ రమేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో 30 సంవత్సరాలు అటెండర్‌గా విధులు నిర్వహించిన అశోక్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన సభలో రమేశ్ మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగస్తులు కేంద్ర ప్రభుత్వ సంస్థలలో పని చేసే వారు 60 సంవత్సరాలు నిండగానే విరమణ చేయాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగరీత్య ప్రతి ఉద్యోగి సమయ పాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులు నర్సింలు యాదవ్, శ్రావణ్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, పెంటాచారి, నర్సింలు, తుల్జారాంగౌడ్ బ్యాంకు అధికారులు, సిబ్బంది, యూనియన్ నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

అనంతగిరి: తాండూర్ పీఎస్ 2023లో నమోదైన హత్యానేరం కేసులో నిందితునికి కోర్టు జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తీర్పు వెలువరించారని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూర్ పీఎస్ పరిధిలోని సతారాంపేట్‌లో నివాసం ఉంటున్న నిందితుడు మ్యాతరి శాంతకుమార్ తాగొచ్చి భార్య అనసూయను కొట్టి చంపాడు. ఈ ఘటనలో మృతురాలి అన్న శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ రాజేందర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ప్రస్తుత సీఐ సంతోష్ కుమార్ చార్జిషీట్‌ను సమర్పించగా వాదోపవాదాలు విన్న కోర్టు శాంత్‌కుమార్‌కు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో నిందితునికి శిక్ష పడేవిధంగా పనిచేసిన పీపీ సుధాకర్‌రెడ్డి, మొదటి ఐఓలు రాజేందర్‌రెడ్డి, సంతోష్‌కుమార్, ప్రస్తుత డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీడీఓ సలీంపాషా, బ్రీఫింగ్ ఆఫీసర్లు వీరన్నలను ఎస్పీ అభినందించారు.

పట్టాలు దాటుతుండగా రైలు ఢీ..

వృద్ధురాలి మృతి

తాండూరు టౌన్: పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీ కొనడంతో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన తాండూరు రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాత తాండూరులోని హనుమాన్‌గల్లీకి చెందిన నర్సమ్మ (65) పింఛను తీసుకుని ఇంటికి బయలుదేరింది. మధ్యలో పాత తాండూరుకు వెళ్లే మార్గంలో రైలు గేటు పడింది. చెవులు సరిగా వినపడని నర్సమ్మ రైలు వస్తుండటాన్ని గమనించలేదు. దీంతో పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సమావేశానికి హాజరైన విద్యార్థులు

పులకించిన మొగిలిగిద్ద

వైభవంగా ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి
- పూర్వ విద్యార్థులు, మేధావులు, అతిథులతో సందడి వాతావరణం
- గ్రామానికి సీఎం వరాల జల్లు



సరస్వతీదేవి విగ్రహానికి పూల మాల వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సభలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అతిథులు

ఎంతో మంది మేధావులతో అక్షరాలు దిద్దించిన పాఠశాల పూర్వ విద్యార్థులు, అతిథుల సందడితో పులకించింది. చదువులమ్మ ఒడికి చేరిన పాత, ప్రస్తుత విద్యార్థులు జ్ఞాపకాల జడిలో మునిగిపోయారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకావడంతో వీరి ఆనందం రెట్టింపైంది.

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పూర్వ విద్యార్థి, పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలకు సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలకరించారు. ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ మహేందందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్

ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యాశాఖ అధికారులు ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. స్కూల్, గ్రామ చరిత్ర, నాటి నవాబుల పాలనకు సంబంధించిన ఫొటోలను ఇందులో ప్రదర్శించారు. స్కూల్‌కు సంబంధించి వివిధ దినపత్రికల్లో వచ్చిన కథనాలను సీఎం ఆసక్తిగా తిలకించారు. పాఠశాల పూర్వ విద్యార్థులను సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. బహిరంగ సభకు వెళ్లే ముందు అందరితో కరచాలనం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎంను శాలువాతో సన్మానించారు.

భారీగా నిధులు మంజూరు

మొగిలిగిద్దకు సీఎం వరాల జల్లు కురిపించారు. అత్యాధునిక వసతులతో పాఠశాల నూతన భవనానికి రూ.10 కోట్లు, గ్రంథాలయ నిర్మాణం కోసం కోటి రూపాయలు, గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, తాగునీటి వసతి వంటి మౌలిక సదుపాయాల రూపకల్పకు రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అడ్వాన్స్‌డ్ సెంటర్‌తో పాటు ఎమ్మెల్యే శంకర్ కోరిక మేరకు గ్రామంలో షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

పటిష్ట బందోబస్తు

సీఎం పర్యటన నేపథ్యంలో సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా చర్యలు చేపట్టారు. పాఠశాల, బహిరంగ సభ ప్రాంగణంలోకి వెళ్లే వారితో పాటు సభావేదికను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

తరలివచ్చిన జనం

సీఎం బహిరంగ సభకు వివిధ గ్రామాల నుంచి జనం భారగా తరలివచ్చారు. సుమారు పదివేల మందితో సభా ప్రాంగణం నిండిపోయింది. హెలిపాడ్ నుంచి బహిరంగ సభకు వచ్చే దారిలో, పరిగి రోడ్డు గుండా పార్టీ నాయకులు, కార్యకర్తల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కేరింతలు కొట్టారు.

సభ సైడ్ లైట్స్

- సీఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 4.40 నిమిషాలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో మొగిలిగిద్దకు వచ్చారు.
- స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.
- సాయంత్రం 4.45 నిమిషాలకు హెలిపాడ్ నుంచి ప్రత్యేక వాహనంలో ప్రభుత్వ పాఠశాలకు చేరుకుని ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.
- 5గంటలకు పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహానికి పూల మాలలు వేశారు.
- అనంతరం అరగంట పాటు పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు.
- 5.30 గంటలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి పాఠశాల నుంచి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకున్నారు.
- 5.40నుంచి 6గంటల వరకు సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో ప్రసంగించారు.
- 6.10 నిమిషాలకు హెలికాప్టర్‌లో తిరిగి హైదరాబాద్ బయలుదేరారు.

భవిష్యత్తుకు పునాదులు

షాద్‌నగర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఇది గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్ద పీట వేశారన్నారు. బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. షాద్‌నగర్‌కు ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

‘పది’ విద్యార్థులకు అల్పాహారం

నేటి నుంచి అమలు

బొంరాస్‌పేట: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది.. ఇందులో భాగంగా అన్ని పాఠశాలల్లో సాయంత్రం 4.15 నుంచి 5.15వరకు గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యాన్ని పంచేందుకు ప్రతి రోజూ సాయంత్రం పోషకాలతో నిండిన స్నాక్స్(అల్పాహారం) అందజేయాలని నిర్ణయించింది. ఇందుకుగాను పాఠశాల ఖాతాల్లోకి డబ్బు జమ చేయనుంది. రోజుకు ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున ఖర్చు చేసి స్నాక్స్ అందించనున్నారు. మార్చి 21వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ముగిసే దాకా స్నాక్స్ ఇవ్వనున్నారు.

221మంది విద్యార్థులకు లబ్ధి

మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 148మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. రేగడి మైలారం ఉన్నత పాఠశాలలో 18మంది, చౌదర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 55మందితో కలిపి మొత్తం 221మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. అలాగే మండలంలోని బొట్లోనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 54మంది విద్యార్థినులు ఉన్నారు. వీరికి నిత్యం పండ్లు, గుడ్లు, స్నాక్స్ ఇస్తున్నారు. ఒక్కో విద్యార్థిని కోసం రోజుకు రూ.20 చొప్పున ఖర్చు చేస్తున్నారు.



విద్యార్థులకు అల్పాహారం (ఫైల్)

పౌష్టికాహారంగా ఇవి..

- ఉడకబెట్టిన పెసర్లు (గుడాలు/గుగ్గిళ్లు)
- ఉడకబెట్టిన బెబ్బెర్లు(గుడాలు/గుగ్గిళ్లు)
- పల్లీలు బెల్లం లేదా పల్లీ పట్టీ
- చిరుధాన్యాలతో ఉన్న మిల్లెట్ బిస్కెట్లు
- ఉల్లిపాయ పకోడీ
- ఉడకబెట్టిన శనగలు (నిత్యం ఒక రకం) అందివ్వాలని ప్రభుత్వం స్నాక్స్ మెనూ తయారు చేసింది.

మంచి నిర్ణయం



ప్రతి రోజూ సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు పోషకాలతో నిండిన స్నాక్స్ ఇవ్వడం ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయం.. స్కూల్ ముగిసిన తర్వాత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఆ సమయంలో ఆకలి వేస్తుంటుంది. స్నాక్స్ ఇస్తే చదువుపై దృష్టి పెట్టేందుకు వీలు ఉంటుంది.

– జాదవ్ సునిత, పదో తరగతి, బాపన్‌చెర్వుతండా

గురుకులాలతో సమానంగా..

గురుకులాలు, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సాయంకాలం స్నాక్స్ ఇస్తుంటాం. ఇదే పద్ధతిని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అమలు చేస్తాం. ఒత్తిడికి గురై అలసిపోయే పదోతరగతి విద్యార్థులకు పోషకాహారం ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్యార్థులకు మేలు చేకూరుతుంది.

– హరిలాల్, ఎంఈఓ, బొంరాస్‌పేట

తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్

సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్

అనంతగిరి: సిమెంట్ రంగంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్ అన్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లిలో శ్రీ తిరుమల ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీమేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని తెలిపారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణానికి సరైన ఎంపిక అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని తెలిపారు. కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయపడతారని తెలిపారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాపాస్ట్ రూ.20 అధికంగా ఉంటుందన్నారు. అనంతరం 40మంది తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల విలువ చేసే ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో డీలర్ బాలరాజు, భారతి సిమెంట్ బృందం సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సామ్రాట్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

తాండూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తాండూరు మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించి 88 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజాల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చందు తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ప్రారంభం..

తాండూరు మండలం అంతారం గుట్ట వద్ద రూ.2 కోట్లతో నిర్మించిన ఇండోర్‌స్టేడియాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. స్టేడియంలో సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ విభాగం డీఈ రాజు, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

యాలాల: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అగ్గనూరు, యాలాల ఉన్నత పాఠశాలల్లో రూ.54లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో విద్యకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేశారన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. సంక్షేమ హాస్టళ్లలో మెస్, కాస్మోటిక్స్ చార్జీలను పెంచారని గుర్తు చేశారు. అగ్గనూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

స్టేజీని ప్రారంభించిన ఎమ్మెల్యే

మండలంలోని దేవనూరు ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కిషన్‌రావు తన సొంత ఖర్చులతో నిర్మించిన స్టేజీని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రావును పాఠశాల సిబ్బందితో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తంరావు, శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం, మాజీ అధ్యక్షుడు గాజుల మన్నాన్, కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా పాల్గొన్నారు.



దేవనూరులో స్టేజీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

న్యాయం చేయాలని వినతి

పూడూరు: కబ్జాకు గురైన తమ భూములను ఇప్పించి, తమకు న్యాయం చేయాలని పూడూరు మండలం ఎనకేపల్లి దళిత రైతులు వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం పూడూరు మండలం ఎంకేపల్లి గ్రామానికి చెందిన రైతులు మన్నెగూడ పెంటయ్య, కంతల భీమయ్య, బుజ్జమ్మ, ఆనందం, మాలే భీమయ్య, విజేందర్, పులేందర్, తదితరులు తమ పూర్వికుల నుంచి సంక్రమించిన ఇనాం పట్టా సర్వే నెంబర్ 115లో రియాల్టర్లు బర్కత్ అలం ఖాన్, తండ్రి హైమత్ అలం ఖాన్, యువరాజు, హైదర్, సుధాకర్ రెడ్డిలు మైరాన్ వెంచర్ పేరిటా తమ భూములను ఆక్రమించారని అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మా పూర్వికులు సంబంధిత వ్యక్తులకు అమ్మారంటూ తప్పుడు పత్రాలు సృష్టించి మొత్తం 19 ఎకరాల భూమిని కబ్జా చేశారని లింగ్యానాయక్‌కు వారు మొరపెట్టుకున్నారు. అందులో అమ్మని భూమిని సైతం 14 ఎకరాల భూమి చుట్టూ రాత్రికిరాత్రే బౌండరీ నిర్మించారని ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- త్వరలోనే తాండూరులో తాత్కాలిక ప్రెస్ భవన్
- ఐజేయూలో పలువురి చేరిక

తాండూరు టౌన్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఐజేయూ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వేణుగోపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి పేర్కొన్నారు. శుక్రవారం సంఘం తాండూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, రామకృష్ణల ఆధ్వర్యంలో తాండూరులో నిర్వహించిన సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశం, సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడూ పత్రికలు, ఛానళ్ల ద్వారా ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. విలువలతో కూడిన జర్నలిజాన్ని కొనసాగించాలని అభిప్రాయపడ్డారు. తాండూరులో త్వరలోనే తాత్కాలిక ప్రెస్ భవన్ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్లు లేని జర్నలిస్టులకు ఇండ్ల మంజూరు, హెల్త్ కార్డుల జారీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఆర్థిక సహకారంతో జర్నలిస్టులందరికీ ప్రమాదబీమా ఇన్సూరెన్సు కల్పించడం అభినందనీయమన్నారు. టీయూడబ్ల్యూజే–143 నుంచి టీయూడబ్ల్యూజే (ఐజేయూ)లో సభ్యత్వం తీసుకున్న విలేకరులను సాధారంగా ఆహ్వానిస్తున్నామన్నారు. సంఘంలో వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అనంతరం తాండూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్ రెడ్డి, రామకృష్ణ మాట్లాడుతూ సంఘం తరుపున పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యేలా శ్రద్ధ తీసుకుంటామన్నారు. నూతనంగా సభ్యత్వం తీసుకున్న శివానంద్ సింగ్, గోపాల్, కృష్ణ, ముక్తార్, నరేశ్, మునీర్, అలీం తదితరులకు రశీదులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం క్రమశిక్షణా కమిటీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశం, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.